క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం భూమి పూజ చేయడానికి నేడు (సోమవారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధర్నాకు తరలిన ఆదివాసీలు



భద్రాచలం వెళ్తున్న ఆదివాసీలు

కన్నాయిగూడెం: మండలంలోని ఆదివాసీ నాయకులు, కులస్తులు ఆదివారం భద్రాచలంలో చేపట్టిన ధర్మ యుద్ధానికి మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు గండ్ల పాపరావు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. పాడెంబాబు, సమ్మయ్య, కేశ్వర్ రావు, మురళి తదితరులు ఉన్నారు.

డీఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కి అభినందన



ర్యాలీలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్

ఏటూరునాగారం: గ్రూప్ 1 ఫలితాల్లో రాష్ట్రంలో 105వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికైన మండల కేంద్రానికి చేరుకున్న ప్రవీణ్ కుమార్‌కు ప్రజాసంఘాల నాయకులు ఆదివారం అభినందించారు. మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. నానమ్మ దగ్గర పెరిగి ఎన్నో కష్టాలను ఎదుర్కొని అంచెలంచలుగా పోటీ పరీక్షల్లో విజయం సాధించాడు. ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన గ్రూపు1 ఫలితాల్లో డీఎస్పీగా ఉద్యోగం సాధించాడు. నియామకమైన మొదటి రోజున ప్రవీణ్ కుమార్ దళితసంఘాలు ప్రజాసంఘాలు ఆయా రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి అతడిని బస్టాండ్ ప్రాంతంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రవీణ్ కుమార్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. చిటమట రఘు, స్నేహితులు, దళిత సంఘాలు పాల్గొన్నారు.

ఇళ్లలోకి చేరిన మురుగు

ఏటూరునాగారం: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని ఆరో వార్డులో మురుగు కాల్వల్లోని నీరు రోడ్డుపై ప్రవహిస్తు ఇళ్లలోకి చేరింది. మురుగు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బంది పడుతున్నామని బాధితురాలు కుమ్మరి పార్వతి ఆదివారం వాపోయింది. పాములు, విషకీటకాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వల్లోని చెత్తాచెదారం, వ్యర్థాలు సైతం ఇక్కడే నిల్వ ఉంటున్నాయని ఆరోపించారు.

బురదమయంగా రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

శంకుస్థాపనకే పరిమితమైన వెలిశాల-పెద్దంపల్లి రహదారి



బురదమమయంగా ఉన్న రోడ్డు



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

టేకుమట్ల: మండలంలోని పెద్దంపల్లి-వెలిశాల-రాఘవాపూర్ రోడ్డు నిర్మాణానికి 2018లో అప్పటి శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి రూ.2 కోట్ల 70 లక్షల నిధులను మంజూరు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా నిర్మాణానికి అలస్యం కావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం 2019లో ఎన్నికల అనంతరం అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో పెద్దపల్లి గ్రామ ప్రజలు వెలిశాలకు వెళ్లడానికి, వ్యవసాయ పనులకు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. చినుకు పడితే చిత్తడయ్యే రోడ్డులో బురద పేరుకుపోయి వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో కనీసం నడిచేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సైతం పనులు కొనసాగేందుకు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా ఇప్పటివరకు కూడా పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాల ఆరంభం నుంచి వర్షాలకు రోడ్డు మొత్తం గుంతలమయమై బురదమయంగా మారుతోంది.

తప్పని తిప్పలు..

పెద్దపల్లి నుంచి వెలిశాల ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ఈ దారిగుండా కాలినడకన, సైకిళ్లపై వెళ్తుంటారు. కానీ రోడ్డు బురదమయం కావడంతో విద్యార్థులు పంగిడి పల్లె మీదుగా వెలిశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పంగిడిపల్లి, పెద్దపల్లి, వెలిశాల, రామకృష్ణాపూర్ (వి) గ్రామాల రైతుల భూములు ఎక్కువగా రాఘవపూర్ శివారులో ఉండడంతో ఈ దారి గుండానే వెళ్లాల్సిందే. ప్రతీ ఏటా రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆశపడుతున్న రైతులకు నిరాశే మిగులుతోంది. బురదమయమైన రోడ్డులో నడిచేందుకు రైతులు ఉదయం సాయంత్రం తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు. కావున ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మించండి..



నిత్యం పంట చేనులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన శంకుస్థాపన చేసిన ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. సాయంత్రం వేళ ఆలస్యం అయితే చీకటి పడే సమయంలో రోడ్డుపై నడవాలంటే కష్టంగా ఉంది.

- శాస్త్రాల పైడి, రైతు పెద్దంపల్లి

బతుకమ్మ పండుగ సందడి



బంతిపూలను కొనుక్కుంటున్న ప్రజలు

టేకుమట్ల: సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో సందడి నెలకొంది. వేలాది మంది జనాలతో మండల కేంద్రం కిక్కిరిసింది. సద్దుల బతుకమ్మ కోసం బంతి పూలను రాసులగా పోసి విక్రయించారు. బంతిపూలను కొనేందకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. కిక్కిరిసిన జనాల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బతుకమ్మ పండగ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చిన ఓ వృద్ధురాలికి విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ తుల రమేశ్ నగదును అందించి, ఏదైనా కొనుక్కోమన్నారు. దీంతో వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేశారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు



బతుకమ్మ ఆడే స్థలాన్ని చదును చేస్తున్న దోజర్

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాలతో గ్రామాలలో బతుకమ్మ సంబరాలకు పంచాయతీ సిబ్బంది ఆదివారం ఏర్పాట్లు చేశారు. సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. గ్రామాల్లో బతుకమ్మ ఆడే స్థలాన్ని ట్రాక్టర్ సహాయంతో చదును చేశారు. అలాగే నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం నాడు పాఠశాలలోని తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐలయ్య, రాంమోహన్, శ్యాంసుందర్, నాగరత్నం, భాష, స్వాతి, రాజేందర్, సాంబయ్య, విజేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు కట్కూరి నరేం దర్, మేడిపెల్లి శ్రీనివాస్, తోట నాగరాజు, కుమార్, నవీన్, ఆదినారాయణ, ఆకుల రాజు, కుమారస్వామి, రాజు, రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు



తాడిచర్లలో వీధిదీపాలు బిగిస్తున్న సిబ్బంది

మల్హర్: మండలంలో ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లను ఆదివారం అమర్చారు. మండలంలోని పంచాయతీల్లో వీధిలైట్లు వెలుగపోవడంతో 'వీధి దీపాలు వెలిగేనా?' అనే శీర్షికణ ఈనెల 20న 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి విధిలైట్లను వేయించారు.తాడిచర్లలో 335, మల్లారంలో 200, పెద్దతూండ్లలో 250, చిన్నతూండ్లలో 50, అడ్వాలపల్లిలో 65, దుబ్బపేటలో 30, కొయ్యూరు 100, వల్లెకుంట 150, కొండంపేట 25, ఇప్పలపల్లిలో 45, ఎడ్లపల్లి 50, అన్సాన్‌పల్లి 65, నాచారం 120, మల్లంపల్లిలో 40 ఎల్‌ఈడీ లైట్లను బిగించారు.

సాక్షి ఎఫెక్ట్..

శునకాలకు రేబిస్ టీకాలు తప్పనిసరి

- మండల పశువైద్యాధికారి రమేశ్



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న రమేశ్

కాటారం: పెంపుడు శునకాలకు రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేశ్ సూచించారు. రేబిస్ వ్యాక్సిన్ కనుగొన్న శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ఆంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను గూర్చి కుక్కల పెంపకదారులకు అవగాహన కల్పించారు. కుక్క కరిచిన, గోళ్లతో గీరిన 24 గంటల లోపు వ్యాక్సిన్ వేయించుకోవాలని పేర్కొన్నారు. పెంపుడు కుక్కలపై జాగ్రత్తగా ఉండాలని, తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించకపోవడం సరికాదు

గోవిందరావుపేట: మండలంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో 18 గ్రామ పంచాయతీలకుగాను వార్డు మెంబర్లకు ఎస్సీ రిజర్వేషన్లు కేటాయించకపోవడం సరికాదని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించాలని అన్నారు. ఎన్నికల అధికారులు ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోని దళితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేకపోతే ఎస్సీ రిజర్వేషన్ సాధన కోసం కోర్టు వరకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

భూపాలపల్లి రూరల్: త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా భూపాలపల్లి మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లు, 11ఎంపీటీసీల స్థానాలకు రిజర్వేషన్లను శనివారం రాత్రి ఖరారు చేసినట్లు భూపాలపల్లి ఎంపీడీఓ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆముదాలపల్లి, బావూసింగ్‌పల్లి, గొల్లబుద్ధారం, నేరేడుపల్లి జనరల్, ఆజంనగర్, దూదేకులపల్లి, గుర్రంపేట, మోరంచపల్లి, పంబాపూర్ (బీసీ జనరల్), దీక్షకుంట, గుడాడుపల్లి, కొత్తపల్లి, పెద్దాపూర్, రాంపూర్ (బీసీ మహిళ), కమలాపూర్, కొంపల్లి తండా, గొర్లవీడు తండా, లంబాడి తండా (పి) ఎస్టీ జనరల్, గొర్లవీడు, లంబాడి తండా (బీ), శ్యాం నగర్ (జనరల్ మహిళ), నాగారం, సుబ్బక్కపల్లి, వజీనపల్లి (ఎస్సీ మహిళా), నందిగామ (ఎస్టీ మహిళ), కొంపల్లి ఎస్సీ (జనరల్)గా కేటాయించారు. ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.. ఆజంనగర్, పంబపూర్, కొంపల్లి (బీసీ జనరల్), గొల్ల బుద్ధారం (ఎస్సీ మహిళ), గొర్లవీడు, పెద్దాపూర్ (బీసీ మహిళ), గుర్రంపేట (జనరల్), కమలాపూర్ (ఎస్టీ జనరల్), కొత్తపల్లి (ఎస్ఎం) (జనరల్ మహిళ), నాగారం (ఎస్టీ మహిళ), నేరేడుపల్లి (ఎస్సీ జనరల్)గా కేటాయించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

మొగుళ్లపల్లి: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ యువజన సంఘం అనగారిన వర్గాల అభివృద్ధికి పాటుపడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధికార ప్రతినిధి నిమ్మల భద్రయ్య, బండారి కుమార్, బండారి అశోక్, రత్నాకర్, డప్పు కళాకారులు బండారి బిక్షపతి, అంతడుపుల చందర్, బండారి భిక్షపతి, మేకల శ్రీకాంత్, బండారి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్



క్రీడలను ప్రారంభిస్తున్న క్రాంతికుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రంగాపూర్ ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో తాడ్వాయి, పినపాక, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల ఐదు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై క్రీడాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో అణిముత్యం లాంటి క్రీడాకారులు ఉన్నారని, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలితీతకు ఇలాంటి క్రీడాలు దోహదపడుతాయన్నారు. ఐపీఎల్ తరుణంలో పట్టణ ప్రాంతంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం గొప్ప ఆలోచన అని మేనేజ్మెంట్ నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇర్ప సూర్యం, చెన్నూరు శేషుబాబు, గుమ్మడి ముత్తయ్య, దాసరి శివానందు, రామనాథం, వెంకన్న, స్వామి, టోర్నమెంట్ నిర్వహకులు రంజిత్, సుధాకర్,గోపి, శివ, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఆదిలోనే ముంచిన గోదావరి



గోదావరి వరదలో మునిగిన మిర్చి పంటలు



మునిగిన పంటను చూపిస్తున్న రైతు

- సుమారు 500 ఎకరాల్లో మిర్చి పంట నష్టం
- నార్ల కోసం రైతుల వెతుకులాట

వాజేడు: ఆచి తూచి అడుగేసినప్పటికీ మిర్చి రైతులను గోదావరి నట్టేట ముంచింది. ఆదిలోనే రైతులు కోలుకోకుండా దెబ్బకొట్టింది. తుపాను ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు పడటంతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదతో గోదావరి ఉప్పొంగింది. పల్లపు ప్రాంతాల గుండా ప్రవహించిన గోదావరి మిర్చి చేలను ముంచెత్తింది. దీంతో వందలాది ఎకరాల మిర్చి గోదావరి పాలైంది.

సుమారు 500 ఎకరాల్లో నష్టం..

గోదావరి వరదల మూలంగా మండల వ్యాప్తంగా సుమారుగా 500 ఎకరాల్లో మిర్చి పంట ముంపునకు గురై నష్టపోయినట్లు రైతులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. రైతులు ఇప్పటి వరకు ఒక్కో ఎకరానికి రూ.20 వేల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడిస్తున్నారు. ఆలస్యంగా వేస్తే నల్లి ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వర్షాలు తగ్గడంతో గతంలో మొక్కేతలు వేశామని తెలిపారు. అనుకొకుండ వచ్చిన గోదావరి మూలంగా తీవ్రంగా నష్ట పోయినట్లు తెలిపారు.

రూపాయికి మొక్క..

గోదావరి ముంపునకు గురై మిర్చి తోటలను కోల్పోయిన రైతులు మరో మారు మొక్కేతలను వేయాలని చూస్తున్నారు. కాని వారి వద్ద మిర్చి నారు లేకపోవడంతో నాణ్యమైన నారు కోసం వెతుకుతోన్నారు. వెంకటాపురం(కె), ఏటూరునాగారం, మంగపేట మండలాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల తదితర మండలాల్లో నార్ల కోసం ఆరా తీస్తున్నారు. కాగా ఒక్కో మొక్క రూపాయికి విక్రయిస్తున్నట్లు తెలిసింది. రైతులు వారికి చాలినంత ఉంచుకొని మిగులు నారును విక్రయిస్తున్నారు. కొందరు మాత్రం కేవలం విక్రయించడానికే నారు పోసి అమ్ముతున్నట్లు సమాచారం. కొందరు రైతులు ఇప్పుడు నార్లను పోసి నెల రోజుల్లో మొక్కేతలను వేయాలని చూస్తున్నారు.

ఎమ్మెల్యే పరిశీలన..



నీటిలోని మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు(ఫైల్)

గోదావరి వరద మూలంగా మిర్చి పంటలు నీటిలో మునిగి నష్టపోవడంతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మండలానికి వచ్చిన సమయంలో పరిశీలించారు. మిర్చి పంటలు నీటి పాలై నష్ట పోయిన విషయాని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని, రైతులకు న్యాయం జరిగిలే చూస్తానని రైతులకు తెలిపారు. ఏ మేరకు నష్టం వాటిల్లిందనే విషయాన్ని రైతులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

మిర్చినారుకు డిమాండ్



మిర్చినారును విక్రయిస్తున్న రైతులు

ఏటూరునాగారం: వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో మిర్చినారుకు ఏరుకుళ్లు వచ్చి చనిపోతోంది. మిర్చి నారు దొరకకపోవడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నారు దిబ్బలను గ్రామీణ సమీపంలోని ఇళ్ల వద్ద పలు రకాల మిర్చినారును పెంచి రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగిపోయింది. రూ.1ల నుంచి రూ. 2ల వరకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. మిర్చినారును ఆటోల్లో, కూలీల ద్వారా పొలాలకు చేరవేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మోటం రాజు తన మొబైల్ ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను తిరిగి స్వాధీనం చేసుకుని ఆదివారం బాధితుడికి ఎస్సై శ్రావణ్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఎస్సైకి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు

మంగపేట: మండల వ్యాప్తంగా గ్రామాల్లో మహిళలు ఆదివారం బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ ఆట పాటలతో సందడి నెలకొంది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. బతుకమ్మ పండుగ మొదటి రోజు నుంచి వర్షం పడుతున్నా తడుస్తూ మరి సంబరాల్లో పాల్గొంటున్నారు. పలు గ్రామాల్లో సోమవారం, మరికొన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం వచ్చినా ఆలంకం కలగకుండా ఉండేందుకు ఆటస్థలంలో వాటర్‌ప్రూఫ్ టెంట్ల కింద సద్దుల బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల శ్రీ చెన్నకేశవ ఆలయంలో దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవికి ఏడో రోజు శ్రీమహాచండీ దేవి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించగా గ్రామంలోని మహిళ భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.